# అసిరమ్మ దేవత

ఆర్. జగదీశ్వరరావు

పూచిన ప్రతి పువ్వుకీ పరిమళం ఉండదు.

పుట్టిన ప్రతి మనిషికీ మానవత్వం ఉండదు.

దేవుడని పూజించే ప్రతి రాతికీ దైవత్వం ఉండదు.

* * *

అనగనగా ఒక భూగోళం. అది ఆరు ఖండాలుగా విభజించబడింది. అందులో మనుషులు జనాభా అభివృద్ధిలో మాత్రమే ముందంజవేస్తూ మిగతా విషయాల్లో వెనకపడి, అన్నిటికంటే పెద్దదనే గౌరవమూ, స్పెషాలిటీ సంపాదించింది ఆసియా ఖండం. అందులో ఆశయాలకి పుట్టి, ఆచరణలకి వట్టిదే అయిన భారతదేశం. ఆ దేశంలో అన్నపూర్ణ అన్న బిరుదు కలిగి అన్నం మాత్రమే లేని ఆంధ్రరాష్ట్రం. అందులో ప్రజలకి ఆరంభ శూరులనీ, అనైక్యులనీ, అలజడులు సృష్టించడంలో అఖండులనీ ఆంధ్రేతరు లంటారు. అట్టి రాష్ట్రంలో పేకలు తియ్యడంలో తప్ప మిగతా విషయాల్లో వెనకబడిన జిల్లా శ్రీకాకుళం జిల్లా. ఆ జిల్లాలో అదో చిన్న గ్రామం.

ఆ గ్రామంలో మనుషులకి పీల్చటానికి గాలుంది. త్రాగటానికి నీరుంది. సరదాగా మాట్లాడ్డానికి రంకుకథా లున్నాయి. తెలివిగా మాట్లాడ్డానికి రాజకీయా లున్నాయి. మోసగించడానికి పెద్ద మనుషులూ, మోసగించబడ్డానికి అమాయకులూ ఉన్నారు.

ఆ గ్రామంలో పెద్ద ఘోరం జరిగిపోయింది.

"అసిరమ్మ చచ్చిపోయింది."

"కాదు. మర్డర్ చెయ్యబడింది" అన్నారు కొందరు.

"కాదు, ఎస్సేసినేషన్" అన్నారు రాజకీయనేత్తలు.

అసిరమ్మ పుట్టిన తరవాత భూమి మార్యాడి చుట్టూ ముప్పై సార్లు తిరిగింది. ముప్పై ఒకటో సారి తిరుగుతుండగా అసిరమ్మ తిరగడం మానేసింది.

ముఖ్యమైన విషయం ఏమిటంటే—

"ఎవరు చంపారు?"

రష్యాలో ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్ లేదట.

తినడానికి తిండిమాత్రం ఉందట.

ఇండియాలో ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్ ఉంది.

తినడానికి తిండిమాత్రం లేదు.

మొదటిది ముఖ్యమని కొంద రంటారు.

రెండవది ముఖ్యమంటారు కొందరు.

రెండూ ముఖ్యమే అంటారు ఇంకొందరు.

కాని, ప్రస్తుతం అసిరమ్మని ఎవరు చంపారన్నది ప్రశ్న.

అసిరమ్మకి అందర్నీ ఆకర్షించగల కళ్ళూ, మొగుడు తన్నితే భరించగల ఒళ్ళూ, ఇద్దరు మగాళ్ళ పని చెయ్యగల కాళ్ళూ చేతులూ ఉన్నాయి.

అయినా, తనని రక్షించడానికి ఇద్దరు రౌడీలని ఉంచింది. ఒకడు పోలిగాడు; మరొకడు ఎరకడు.

కంచే చేను మేసింది. పూజారే దేవుడి నగలు దొంగిలించాడు.

"పోలిగాడు, ఎరకడు అసిరమ్మని చంపేసినారు" అన్నారు ఊళ్ళో ప్రజలు.

• • •

ఆ ఊరి నాయుడు గారి పేరు నాయ్డు గారు. ఆయన సారా తాగరు. బ్రాందీ తాగుతారు. సారా తాగవని అందరితోనూ చెబుతారు.

ఆ ఊరి కరణం గారి పేరు వెంకన్న గారు. ఆయన సారా తాగుతారు. అయినా, అనవసర ప్రసంగం చెయ్యనవీ, ఎవరినీ తిట్టననీ అందరితోనూ చెబుతారు.

ఆ ఊరి బారికి జోగిడు. వాడు సారా తాగుతాడు. తిడతాడు. కాని, బూతులు తిట్టనని అందరితోనూ చెబుతాడు.

పై త్రిమూర్తుల వద్దకీ వచ్చి పోయిందో, మర్డర్ చెయ్యబడిందో, ఎసేసినేట్ చెయ్యబడిందో తెలియని అసిరమ్మ కేసు వచ్చింది.

వినాయకుణ్ణి పిలవా లనుకున్నారు త్రిమూర్తులు.

వారు ఆ ఊరికి ప్రెసిడెంటుగారు.

ఆయనకి మదిరా సేవే ప్రజా సేవ. మానినీ సేవే మాధవసేవ. ఆయన వైట్, నాటూ రెండూ తీసుకుంటారు. సోషలిస్టునని చెప్పుకుంటారు.

దక్షిణివ్వకపోతే దేవుడిచ్చినా పూజారి వరమివ్వడు. లంచమివ్వకపోతే మంత్రి గారు చెప్పినా క్లర్కు పని చెయ్యడు. బుద్ధి సమర్పించుకోకపోతే ప్రెసిడెంటు గారు చెప్పినా ఆయన బ్రహ్మ పనిచెయ్యగ.

ఇంతలో "జయ విజయు లొస్తున్నారు" అన్నారు అప్పుడప్పుడూ పురాణాలు విన్న నాయుడు గారు.

"కాదు. రావణ, కుంభకర్ణులు" అన్నారు రీసెంటుగా 'రామాయణంలో రాజకీయాలు' సినిమా చూసిన కరణం గారు.

"కాదు. పోలిగాడు, ఎరకడు!" అని నిజం చెప్పేశాడు బారికి జోగిడు.

వాళ్ళిద్దరూ వచ్చి వంగి దండం పెట్టి, "అసిరమ్మని మేమే సంపేశా"మన్నారు.

మీరు రక్షించం డన్నారు.

మీ కాళ్ళకి చెప్పు లా వ:న్నారు.

ఇంకా చాలా అన్నారు.

చివరికి నీళ్ళలో ముంచినా, సారాలో ముంచినా మీదే భారమని ప్రెసిడెంటు గారి కాళ్ళొకడు, నాయుడుగారి కాళ్ళొకడు పట్టుకున్నారు.

"ఏమంటారు, నాయ్డుగారూ! నీళ్ళలో ముంచుదామా, సారాలో ముంచుదామా" అన్నారు ప్రెసిడెంటు.

"నీళ్ళలో ఎవరయినా ముంచుతారు. సారాలో ముంచడమే గొప్పతనమూ, మానవసేవా" అన్నారు నాయ్డు.

"కాని, దానికి డబ్బు కావాల. దాని సంగతేటి?" అన్నాడు కరణం.

"అవును, డబ్బు కావాలి. నిజమే" అని పెద్ద లిద్దరూ ఉమ్మడిగా పోలిగాడు, ఎరకడు వైపు చూశారు.

అప్పు డా ఇద్దరు మానవులూ మాట్లాడకుండా బొడ్డులో భద్రంగా దాచిన బంగారం గొలుసు, నాను, కంటె, దుద్దులు, వెండికడియాలు, గొలుసులు తీసి వారి ముందు పడేసి, "ఇది అసిరమ్మని" అన్నారు.

బారికిజోగిడికి చిన్న లనుమానం వచ్చింది.

"మరైతే దాన్నెందుకు సంపేసినారు?"

"మా క్కావలసింది అసిరమ్మ బంగారం కాదు. బంగారం సొయిలో ఉన్న అసిరమ్మ. అద్వొరకనేదు. సంపేసినాం" అన్నారు.

ప్రెసిడెంటుగారు ఒక నిశ్చయాని కొచ్చి లేచి నించున్నారు.

వెండి గొలుసులు, కడియాలు బారి కిచ్చేరు.

బంగారు దుద్దులు కరణాని కిచ్చేరు.

కంటె నాయుడు చేతిలో పెట్టేరు.

గొలుసు తన జేబులో వేసుకున్నారు.

నాను తీస్తూ, "ఇది ..." అని మాట పూర్తిచెయ్యకుండానే "ఎర్ర టోపీలకి ..." అని కరణం గారు పూర్తి చేశారు.

* * *

ప్రెసిడెంటుగారు నాను జేబులో వేసుకొని పదిమైళ్ళ దూరంలో ఉన్న పోలీస్ స్టేషను కెళ్ళి ఖాళీ జేబుతో తిరిగొచ్చారు.

వచ్చిన వారు మిగతా భాగమ్మల్ని పిలిపించారు.

"అంతా సవ్యంగా జరిగిందా?" నాయుడు గారు కుశల ప్రశ్న వేశారు.

"ఆఁ జరిగినట్టే."

"అంటే ఇంకా జరగాల్సిం దేమైనా ఉందా?"

"జరక్కూడనిది ఒకటుంది. ఈ ఊరి నుంచి రిపోర్టెళ్ళకూడదు" అంటూ, "ఒరేయ్, బారికీ, మాస్టర్ని పిలుచుకురా" అన్నారు ప్రెసిడెంటుగారు.

"మనల్ని కాదని రిపోర్టిచ్చే ధైర్యం ఎవడి కుంది?"

"ఎవడికుందో వాణ్ణే రప్పిస్తున్నాను."

అయిదు నిమిషాల్లో మాస్టరుగారు వచ్చి పడ్డారు.

అతని చేతిలో కాగితాల కట్టుంది. నొసట కుంకుమ బొట్టుంది. ఒంటి మీద తెల్లనిదే నల్లగా తయారైన షర్టుంది. వారు ప్రోనోట్లు వ్రాస్తారు. ప్రైవేట్లు చెపుతారు. తీరిగ్గా ఉన్నప్పుడు స్కూలుకి కూడా వెళతారు.

"సెలవుల్లో కూడా పనేమిటి, మాస్టారూ" అంటూ క్రిందకున్న మీసాన్ని పైకి పెట్టారు ప్రెసిడెంటు గారు.

"అయ్యా! సెలవులైతేనేం? పెన్షను వర్కుందిగాని నా పెన్సు పోతోంది" అని మొరపెట్టేరు మాస్టరు గారు.

"అలాగా! పెన్షన్ వర్కుతోనే పెన్సు పోతుందా?" అంటూ గోల్డు ఫ్లేక్

ఇలా తొమ్మిది రోజులూ అసిరమ్మ యాత్ర ముగిసిపోయింది.

* * *

పదవ రోజు ప్రెసిడెంటు గారి ప్రైవేటు గదిలో దుష్ట చతుష్టయం లెక్కలు చూసుకుంటున్నారు.

"కరణంగారూ! లిస్టు చదవండి."

"అసిరమ్మ యాత్ర. చందాల వసూలు మొత్తం అంటే మన గ్రామంలోనూ, పక్క గ్రామాల్లోనూ కలిపి: పద్దెనిమిది వందల ఏభై. అసిరమ్మ కొచ్చిన దక్షిణలు: ఆరు వందల ఏభై రూపాయల నలభై పైసలు. పన్నెండు హోటళ్ల వాళ్లూ పన్ను కింద ఆరు వందలు. చిల్లర దుకాణాల వసూళ్లు రెండు వందల ఎనభై అయిదు. సారా దుకాణాల వసూళ్లు ఆరు వందల నలభై. మూడు ముక్కలాట వాటా సంబై. లాటరీ ..."

"మొత్తం చెప్పండి."

"మొత్తం అయిదువేల మూడు వందల రూపాయలు" అని ముగించారు కరణంగారు.

సగమ్ము పేరు ప్రెసిడెంటు గారిది. మిగతా సొమ్ము ఎవరి అంతస్తుకి తగ్గట్టు వారు తీసుకున్నారు.

అందరూ కలిసి ఏకకంఠంతో "అసిరమ్మ దేవత వర్ధిల్లాలి. అసిరమ్మ దేవతకీ జై!" అన్నారు.

ఇంత యాత్రలోనూ, ఇంత సందడిలోనూ అసిరమ్మ దేవత పెల్లగిలకుండా, కిమ్మనకుండా, కదలకుండా, దుష్ట చతుష్టయాన్ని సంహరించకుండా ఉండిపోయిం దెందుచేతనో! ప్రజలు మాత్రం గొప్ప యాత్ర, గొప్పయాత్రని గోల పెట్టారు. ❋

